సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 19 । మార్చి । 2024



సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి..

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

- 8లో ▸



గరిష్ఠం/కనిష్ఠం
37.7 /22.3

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

చుక్కలను తాకుతున్న బంగారం ధర

సాక్షి, కామారెడ్డి: బంగారం ధర పరుగులు తీస్తూనే ఉంది. రోజురోజుకు కొత్త రికార్డులు నమోదు చేస్తూ పెరుగుతూనే ఉంది. సోమవారం మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం 10 గ్రాముల ధర రూ.67,100 పలికింది. ఇది ఆల్ టైం రికార్డు అని బులియన్ వ్యాపారులు తెలిపారు. పెరిగిన ధరలతో సామాన్యుడు బంగారం కొనలేని పరిస్థితులు నెలకొన్నాయి.

'త్వరలో దోమకొండలో వంద పడకల ఆస్పత్రి'



కామారెడ్డి టౌన్/దోమకొండ: దోమకొండ మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రిని త్వరలోనే 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కానుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిశారు. దోమకొండలో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని షబ్బీర్ అలీ కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని జెడ్పీటీసీ సభ్యుడు తీగల తిర్మల్‌గౌడ్ తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు.

జిల్లా మైన్స్ అధికారిగా నగేష్

కామారెడ్డి క్రైం: జిల్లా మైన్స్, జియాలజీ సహాయ సంచాలకులుగా నగేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన క్రాంతి కుమార్ ఇటీవలే బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నగేశ్ నారాయణపేట జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు.

బాన్సువాడ ఆర్డీవో బాధ్యతల స్వీకరణ



బాన్సువాడ : బాన్సువాడ ఆర్డీవోగా రమేశ్ రాథోడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారిగా పనిచేసిన రమేశ్ రాథోడ్ బాన్సువాడ ఆర్డీవోగా బదిలీపై వచ్చారు. బాన్సువాడలో పనిచేసిన ఆర్డీవో భుజంగరావు నిర్మల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో రమేష్ రాథోడ్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు ఆధారాలు లేకుండా పరిమితికి మించి డబ్బు తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మూల్యాంకన విధుల్లో పాల్గొనాలి

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాకనం ప్రారంభమైందని క్యాంప్ అధికారి రవికుమార్ సోమవారం తెలిపారు. బుధవారం నుంచి రెండో విడతలో అర్థశాస్త్రం, భౌతికశాస్త్రం జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభమవుతాయ న్నారు. రెండో విడత మూల్యాంకన విధుల్లో పాల్గొనాల్సిన అధ్యాపకులకు ఇప్పటికే ఆయా కళాశాలల లాగిన్లకు నియామకపత్రాలను పంపించిందని తెలిపారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు మూల్యాంకన విధులకు హాజరుకానున్న అధ్యాపకులను రిలీవ్ చేయాలని సూచించారు. అధ్యాపకులను రిలీవ్ చేయని ప్రిన్సిపాళ్లతోపాటు రిలీవ్ అయినప్పటికీ మూల్యాంకనానికి హాజరుకాని వారిపైనా చర్యలు తప్పవన్నారు.

చింతల పోషవ్వకు ఉమెన్ ఎనర్జీ అవార్డు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డికి చెందిన దివ్య హస్తం ఆర్గానిక్ ఉత్పత్తుల సంస్థ యాజమాని చింతల పోషవ్వను ఉమెన్ ఎనర్జీ అవార్డు వరించింది. హైదరాబాద్‌కు చెందిన ఉమెన్ ఎనర్జీ ఇంటర్నేషనల్ సంస్థ సోమవారం హైదరాబాద్ గచ్చిబౌలిలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేసింది. దివ్యంగురాలైన పోషవ్వ ఆర్గానిక్ ఉత్పత్తుల తయారీలో చేస్తున్న కృషికిగానూ ఈ అవార్డును అందించినట్లు సంస్థ నిర్వాహకులు ప్రకటించారు.

● ఎన్నిక దూరం..
అదనపు భారం!

- పోలింగ్‌కు రెండు నెలల సమయం
- క్యాడర్‌ను కాపాడుకోవడం అభ్యర్థులకు భారమే..
- తడిసి మోపెడవనున్న ఖర్చులు

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్రంలో మే 13న పోలింగ్ జరగనుంది. అయితే పోలింగ్‌కు దాదాపు రెండు నెలల సమయం ఉండడంతో అప్పటివరకు క్యాడర్‌ను మెయింటెయిన్ చేయడం అభ్యర్థులకు ఖర్చుతో కూడుకున్న పనిగా భావిస్తున్నారు.



సాక్షి, కామారెడ్డి : ప్రధాన పార్టీలు లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంనుంచి పోటీ చేసే అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించాయి. కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ సురేష్ షెట్కార్‌ను అభ్యర్థిగా ప్రకటించగా.. బీజేపీ సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌కు, బీఆర్ఎస్ గాలి అనిల్‌కుమార్‌కు టికెట్టు కేటాయించాయి. అసెంబ్లీ ఎన్నికలలో ఓటమిపాలై అధికారానికి దూరమైన బీఆర్ఎస్.. ఎంపీ ఎన్నికల్లో గెలవడం ద్వారా పార్టీ ఉనికిని చాటుకోవాలనే ప్రయత్నం చేస్తోంది. వంద రోజుల క్రితమే రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీకీ ఎంపీ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఎంపీ ఎన్నికల్లో ఓడిపోతే ప్రభుత్వం మీద ప్రభావం పడుతుందని భావిస్తున్న అధికార పక్షం.. ఈ ఎన్నికలలో గెలుపుకోసం సర్వశక్తులూ ఒడ్డేందుకు సిద్ధమవుతోంది. కేంద్రంలో మూడోసారీ మోదీ సర్కారు నినాదంతో ఎన్నికల బరిలో దిగిన బీజేపీ.. ఎలాగైనా జహీరాబాద్ సీటును కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో ముందుకు సాగుతోంది. ఆ పార్టీ టికెట్టు కోసం హేమాహేమీలు ఎందరో ప్రయత్నించినా.. బీఆర్ఎస్‌కు చెందిన సిట్టింగ్ ఎంపీని తమ పార్టీలోకి చేర్చుకుని అభ్యర్థిగా ప్రకటించింది. జహీరాబాద్ సీటును గెలుచుకునేందుకు ఎత్తులు వేస్తోంది.

అభ్యర్థులకు చుక్కలే...

లోక్‌సభ ఎన్నికలకు రెండు నెలల సమయం ఉంది. ఈ రెండు నెలలు ఆయా పార్టీల అభ్యర్థులకు చుక్కలు కనబడతాయని భావిస్తున్నారు. మే 13న ఎన్నికలు జరుగనుండడంతో షెడ్యూల్‌కు, పోలింగ్‌కు మధ్య సమయం ఎక్కువగా ఉంది. సుమారు రెండు నెలల పాటు ప్రచార కార్యక్రమాలు, క్యాడర్ మెయింటెనెన్స్ అనేది అభ్యర్థులకు తలకుమించిన భారం అవనుంది. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలున్నాయి. ఏడు నియోజకవర్గాల్లోని పార్టీ ముఖ్య నేతలు, ద్వితీయ శ్రేణి నాయకులు, క్యాడర్‌కు కావలసిన సౌకర్యాలన్నీ కల్పించాల్సి ఉంటుంది. చిన్న నిర్లక్ష్యం జరిగినా పార్టీ వీడుతామంటూ బెదిరించే వారూ ఉంటారు. ఎవరు ఏ రోజు ఏ పార్టీలోకి చేరతారో తెలియని పరిస్థితి ఉంటుంది. మరోవైపు ఎన్నికలకు సమయం ఎక్కువగా ఉండడం ప్రచారానికి కలిసి వచ్చే అంశమే. అభ్యర్థులు రోజూ ఐదు నుంచి పది గ్రామాల చొప్పున తిరిగినా పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాలకు వెళ్లడానికి సమయం సరిపోతుందని భావిస్తున్నారు. అయితే ఆయా గ్రామాలకు వెళ్లే క్రమంలో ఖర్చులు కూడా ఎక్కువగానే ఉండనున్నాయి.

యంత్రాంగానికీ సవాలే..

ఎన్నికలకు ఎక్కువ సమయం ఉండడంతో అధికార యంత్రాంగంపైనా భారం పడనుంది. అన్ని రోజులు ఎన్నికల కోడ్‌ను పర్యవేక్షించడం ఇబ్బందికరంగా ఉంటుంది. షెడ్యూల్ వెలువడినరోజు నుంచి కోడ్ అమలులోకి వచ్చింది. ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడం, వాటిని పరిష్కరించడం అధికారులకు కొంత ఇబ్బందికరంగా మారుతాయని భావిస్తున్నారు.

ఎన్నికలకు కాంగ్రెస్ సమాయత్తం



మంత్రి దామోదర రాజనర్సింహతో సమావేశమైన ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు

- మంత్రి నివాసంలో సమావేశమైన పార్టీ ముఖ్యనేతలు
- ప్రచార వ్యూహంపై చర్చ

సాక్షి, కామారెడ్డి: లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ నేతలు సమాయత్తమవుతున్నారు. పార్టీ ప్రచార వ్యూహాలపై చర్చించేందుకు సోమవారం హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ నివాసంలో సమావేశమయ్యారు. జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచార వ్యూహం, పార్టీలో చేరికలు, చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. కార్యక్రమంలో పార్టీ అభ్యర్థి సురేష్ షట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు మదన్మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సక్రమంగా ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలి'



డాక్యుమెంట్ రైటర్‌లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: భూములు, ప్లాట్లు, గృహాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి పంపాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సూచించారు. సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్స్, రియల్టర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రయ, విక్రయాలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నకిలీ పత్రాలుంటే లావాదేవీలను నిలిపివేయాలని సూచించారు. భూములు, ఇళ్లు, ప్లాట్ల కొనుగోళ్లలో చాలామంది అమాయకులు మోసాలకు గురవుతున్నారని, ఆదిలోనే ఈ మోసాలను అరికట్టేందుకు రియల్టర్లు, డాక్యుమెంట్ రైటర్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కామారెడ్డి డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రియల్టర్లు పాల్గొన్నారు.

ఆదుకోవాలంటూ రైతుల ధర్నా



భిక్కనూరు తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు, బీఆర్ఎస్ నేతలు

భిక్కనూరు: వడగండ్ల వానతో నష్టపోయిన రైతులు ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. సోమవారం భిక్కనూరు తహసీల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మండలంలో 3 వేల ఎకరాల్లో వరి, 1600 ఎకరాల్లో మక్క, 200 ఎకరాల్లో కూరగాయల పంట, 50 ఎకరాల్లో మామిడి పంట దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ. 50 వేల చొప్పున నష్ట పరిహారం అందించాలని కోరారు. ధర్నా అనంతరం తహసీల్దార్ శివప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. ఆందోళనలో శ్రీసిద్దరామేశ్వర ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు అంబల్ల మల్లేశం, విండో చైర్మన్‌లు నాగర్తి భూంరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు ద్యావర సాయిరెడ్డి, నేతలు దుర్గారెడ్డి, చిన్న నర్సరెడ్డి, రాజిరెడ్డి, పోతిరెడ్డి, ముదాం సత్తయ్య, పైడి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సెస్సీ పరీక్షలు షురూ



కామారెడ్డి ప్రభుత్వ బాలుర పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ పాటిల్



కామారెడ్డి ప్రభుత్వ బాలుర పాఠశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి

కామారెడ్డి టౌన్: జిల్లాలో పదోతరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. 62 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు జరుగుతున్నాయి. మొదటి రోజు నిర్వహించిన ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షకు 11,962 మంది విద్యార్థులకుగాను 11,940 విద్యార్థులు హాజరయ్యారు. 22 మంది పరీక్ష రాయలేదు. ప్రైవేట్‌గా పరీక్ష రాయడానికి 24 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా ఐదుగురే హాజరు కావడం గమనార్హం. డీఈవో రాజు పరీక్షలను పర్యవేక్షించారు.

కలెక్టర్ తనిఖీ

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తనిఖీ చేశారు. అధికారులతో మాట్లాడి పరీక్ష నిర్వహణ తీరు, విద్యార్థుల హాజరు వివరాలను తెలుసుకున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.

ముంచుకొస్తున్న గడువు

- జిల్లాలో పంచాయతీ పన్నుల వసూళ్ల లక్ష్యం రూ. 9.86 కోట్లు
- వసూలైంది రూ.8.57 కోట్లు
- లక్ష్యం చేరుకుంటామంటున్న అధికారులు



గర్గుల్‌లో పన్నులు వసూలు చేస్తున్న సిబ్బంది

కామారెడ్డి రూరల్: జిల్లాలో 526 పంచాయతీలున్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీల నుంచి ఆస్తి పన్నులు, పన్నేతర ఆదాయం రూపంలో రూ. 9.86 కోట్లను వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు రూ.8.57 కోట్లను వసూలు చేశారు. ఇంకా 1.29 కో ట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 88.07 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు.

వందశాతం వసూళ్లపై దృష్టి...

పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వ నిధులతోపాటు పన్నులే ప్రధాన ఆదాయ వనరు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాల నిర్వహణకు పన్నుల రూపంలో వచ్చిన నిధులను ఖర్చు చేస్తారు. వంద శాతం పన్నుల వసూలుకు జిల్లా స్థాయి అధికారులు తరుచూ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ కూడా పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లపై దృష్టి సారించారు. ఇప్పటికి 88 శాతం పన్నులు వసూలు చేశామని, గడువులోగా లక్ష్యాన్ని చేరుకుంటామని పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

- ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: లోక్‌సభ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు, వివిధ బృందాలు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సువిధ, 1950 నంబర్లకు వచ్చే ఫిర్యాదుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఫిర్యాదు అందిన వంద నిమిషాలలో పరిష్కరించేలా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను అప్రమత్తం చేయాలని సూచించారు. వివిధ సామాజిక మాధ్యమాలు, టీవీ, దినపత్రికలలో వచ్చే ప్రకటనలు, చెల్లింపు వార్తలు, టీవీ న్యూస్, యూట్యూబ్, వే టూ ఎస్ఎంఎస్ తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలకు దరఖాస్తు ఇచ్చిన రోజే అనుమతి ఇచ్చేలా చూడాలన్నారు. ఎన్నికల యంత్రాంగంపై అపోహలు సృష్టించేలా సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించి ఖండించాలని సూచించారు. సీజ్ చేసిన డబ్బులు, ఆభరణాలు ఏడు రోజులకంటే ఎక్కువగా గ్రీవెన్స్ కమిటీ వద్ద ఉండకుండా చూడాలన్నారు. సంబంధిత వ్యక్తులు వాటికి ఆధారాలను సమర్పించకపోతే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు.

సి విజిల్ ద్వారా..

ఎక్కడైనా డబ్బు, మద్యం, విలువైన వస్తువుల పంపిణీ జరిగితే సి విజల్ ద్వారా ప్రజలు ఫిర్యాదులు చేయవచ్చని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సందర్భంగా నిర్వహించే తనిఖీలలో నగదు జప్తు చేసే సమయంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. సమావేశంలో నోడల్ అధికారులు బావయ్య, మురళి కృష్ణ, అంబాజీ, కోటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, ఎన్నికల సూపరింటెండెంట్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికల్లో రైతు నేస్తం

- జిల్లాలో నాలుగు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం
- ప్రతి మంగళ, శుక్రవారాల్లో అవగాహన సదస్సులు
- రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్న శాస్త్రవేత్తలు



నస్రుల్లాబాద్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు, వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)

నిజాంసాగర్: వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లడంతోపాటు రైతుల సందేహాలను నివృత్తి చేయడం కోసం ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొత్త కార్యక్రమాలను రూపొందిస్తోంది. వ్యవసాయం రంగంలో నూతన సాంకేతికత పరిజ్ఞానంపై విస్తృత అవగాహన కల్పించి పంటల ఉత్పత్తి పెంచాలన్నది సర్కారు లక్ష్యం. ఇందులో భాగంగా రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పించి, రైతు నేస్తం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకోవడంతోపాటు వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసింది.

జిల్లాలో 104 రైతు వేదికలు ఉండగా.. ప్రస్తుతం నియోజకవర్గానికో రైతు వేదికలో రైతు నేస్తం కేంద్రాలను ఏర్పాటు చేసింది. కామారెడ్డి నియోజకవర్గంలో భిక్కనూరు రైతు వేదికలో, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎర్రాపహాడ్లో, బాన్సువాడ నియోజకవర్గంలో నస్రుల్లాబాద్‌లో, జుక్కల్ నియోజకవర్గంలో మద్నూర్ రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పించింది. ఆయా వేదికలలో గతవారమే రైతు నేస్తం కార్యక్రమం ప్రారంభమైంది. ప్రతి మంగళ, శుక్రవారాలలో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్‌లో అందుబాటులో ఉంటూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

నేడు రైతునేస్తం కార్యక్రమం



కామారెడ్డి క్రైం: రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొని రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి సోమవారం తెలిపారు. నస్రుల్లాబాద్, మద్నూర్, భిక్కనూరు, ఎర్రాపహాడ్‌లలోని రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడమే కాకుండా వ్యవసాయంలో సందేహాలను నివృత్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ వారం వరిలో పాటించాల్సిన మెలకువలను జగిత్యాలకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాస్ వివరిస్తారని తెలిపారు. ఆయిల్‌పాం సాగులో మెలకువలను కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం డీన్ రాజశేఖర్ వివరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి'



బీర్కూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ : ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం కురిసిన వడగళ్ల వర్షానికి బీర్కూర్‌లో ఓ రైస్‌మిల్ రేకులు కూలిపోవడంతో రైస్‌మిల్ యజమానిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులకు ధాన్యం అమ్మి నష్టపోతున్నారన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. వడగళ్ల వర్షానికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సందీప్, నాయకులు శశికాంత్, అవారి గంగారాం, నాగుల గామ వెంకన్న, ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

క్లుప్తంగా

మేడిచర్లకు 'కీర్తి పురస్కారం'

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రానికి చెందిన కవి భారతి మేడిచర్ల ప్రభాకర్‌రావు హైదరాబాద్ పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం-2022 డాక్టర్ కేవీ రమణాచారి 'కీర్తి పురస్కారం'కు ఎంపికయ్యారని తెలంగాణ గాయత్రి ధార్మిక సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జనగామ చంద్రశేఖర శర్మ సోమవారం తెలిపారు. ఈ నెలా 20న డాక్టర్ ఎన్‌టీఆర్ కళామందిరంలో నిర్వహించే ప్రధానోత్సవ కార్యక్రమంలో తెయూ ఉపాధ్యక్షుడు తంగెడ కిషన్‌రావు పురస్కారాన్ని అందజేస్తారని పేర్కొన్నారు. ప్రభాకర్‌రావు పద్య రచన విభాగంలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఈయన అఖిల భారతీయ భగవద్గీత కేంద్ర ప్రచార మండలి ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. ఇప్పటివరకు మేడిచర్ల 27 పుస్తకాలను రచించారు.

ఎంపీవోపై దాడి సరికాదు



సుభాష్‌నగర్: నాగర్‌కర్నూర్ జిల్లాలోని కోడేరు ఎంపీవోపై ఎంపీపీ దాడిని తెలంగాణ కలెక్టర్ పంచాయతీ వింగ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లోని డీపీవో చక్రవర్తుల తరుణ్‌కుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు సంగ్రామ్, సహా కార్యాలయ ఉద్యోగులు, అసోసియేషన్ సభ్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సంగ్రామ్ మాట్లాడుతూ.. ఉద్యోగులపై దాడులు చేయడం సరికాదన్నారు. ఎంపీపీపై చర్యలు తీసుకునేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు కృష్ణ, ఆదిత్య, సిబ్బంది పాల్గొన్నారు.

బోర్గాం(పి) వీడీసీపై సీపీకి ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగరంలోని బోర్గాం(పి) గ్రామానికి చెందిన చామకూర సుధాకర్‌రెడ్డి అలియాస్ బాయికాడి సుధాకర్‌రెడ్డిని వీడీసీ సభ్యులు బహిష్కరించడంతో సీపీ కల్మేశ్వర్‌కు బాధితుడు సోమవారం ఫిర్యాదు చేశాడు. గ్రామంలో ఎస్సీ, పద్మశాలీ, రెడ్డి కులస్తులను బహిష్కరించినట్లు తెలిపారు. వీడీసీలపై పోలీసులు కేసు నమోదు చేసినా వారికి బెయిల్ మంజూరు కావడంతో ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సీపీ దృష్టికి తీసుకొచ్చారు. వీడీసీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీని కలిసిన వారిలో రచ్చ ఆనంద్, గుండు బ్రహ్మయ్య, చిలుక శ్రీనివాస్, బత్తుల రవి ఉన్నారు.

సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై దృష్టి పెట్టాలి

- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



మద్నూర్‌లో మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి

మద్నూర్(జుక్కల్) : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లపై దృష్టి పెట్టాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యలయంలో సోమవారం పోలీస్, రెవెన్యూ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. జుక్కల్ నియోజికవర్గం పరిధిలో సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి వాటిని తనిఖీ చేసి ఎన్నికలు సజావుగా జరగడానికి పోలీసు, రెవెన్యూ అధికారులు పకడ్బందీ భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లలో తాగునీరు, విద్యుత్, వికలాంగులకు ర్యాంప్‌లు ఉండే విధంగా చూడాలన్నారు. వేసవి కాలం కాబట్టి తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అంతర్రాష్ట్ర సరిహద్దులో నిఘా విభాగం, ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు.

సరిహద్దు వద్ద అధికారుల తనిఖీ

మండలంలోని సలాబత్‌పూర్ వద్ద రాష్ట్ర సరిహద్దును అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి,అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర సరిహద్దులో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద సిఐ నరేష్, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, ఏడు మండలాల తహసీల్దార్‌లు, సిబ్బంది ఉన్నారు.

డిగ్రీ కళాశాలకు రూ.5 కోట్లు మంజూరు



మోర్తాడ్ డిగ్రీ కళాశాల భవనం

- పీఎంయూఎస్‌హెచ్‌ఏ పథకం ద్వారా మోర్తాడ్‌కు మంజూరైన నిధులు
- విద్యార్థులకు మౌలిక వసతులు, గ్రంథాలయం, ల్యాబ్‌ల అభివృద్ధికి వినియోగించే అవకాశం

మోర్తాడ్: మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలకు కేంద్ర ప్రభుత్వం రూ. కోట్ల నిధులను మంజూరు చేసింది. కళాశాల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, గ్రంథాలయం, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌ల అభివృద్ధికి నిధుల కొరత తీర్చడానికి ప్రధాన మంత్రి ఉచ్చతర శిక్ష అభియాన్(పీఎం యూఎస్‌హెచ్‌ఏ) పథకం కింద రూ.5 కోట్లు మంజూరయ్యాయి. జిల్లాలో మోర్తాడ్‌తో పాటు భీమ్‌గల్, ధర్పల్లి, ఆర్మూర్, నిజామాబాద్, బాల్కొండ, బోధన్‌లలో డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. కాగా మోర్తాడ్ కళాశాలకే పీఎం యూఎస్‌హెచ్‌ఏ పథకం కింద నిధులు మంజూరు కావడం విశేషం. ఇప్పటికే నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న కళాశాలకు కేంద్ర ప్రభుత్వ సాకారంతో భారీ మొత్తంలో నిధులు కేటాయించడం ఎంతో ఊరటనిచ్చే అంశమని విద్యాభిమానులు పేర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 కళాశాలలకు నిధులు మంజూరు కాగా ఇందులో జిల్లాలోని మోర్తాడ్ కళాశాల ఎంపికైంది. ఇప్పటికే న్యాక్ ఏ గ్రేడ్ సాధించిన కళాశాలను అటానమస్ గుర్తింపు కోసం ప్రిన్సిపాల్ డాక్టర్ టి పెద్దన్న, అధ్యాపకుల బృందం కృషి చేస్తోంది. ఇప్పుడు కేటాయించిన నిధులతో కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగనుంది.

సంతోషంగా ఉంది



డిగ్రీ కళాశాలకు పీఎం యూఎస్‌హెచ్‌ఏ ద్వారా నిధులు మంజూరు కావడం సంతోషంగా ఉంది. నిధుల మంజూరుకు సహకరించిన ప్రాజెక్టు డైరెక్టర్ సౌందర్య జోసెఫ్‌కు కృతజ్ఞతలు. కళాశాలను మరింత అభివృద్ధి మార్గంలో నడిపిస్తాం. విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తాం.

– డాక్టర్ టి పెద్దన్న, ప్రిన్సిపాల్, మోర్తాడ్

మల్లన్న ఉత్సవాల్లో ఎమ్మెల్యే కేవీఆర్



ఎమ్మెల్యే కేవీఆర్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

దోమకొండ : మండల కేంద్రంలోని మల్లన్న స్వామి ఆలయ ముగింపు ఉత్సవాల్లో సోమవారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పాల్గొని స్వామికి పూజలను నిర్వహించారు. అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనకు శాలువాతో సన్మానం చేశారు. ఆలయాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరి భూపాల్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు చింతల రాజేష్, పార్టీ మండల నాయకులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు నేతుల నాగరాజు, కట్ట లక్ష్మణ్ తదితరులున్నారు.

యథేచ్ఛగా ఇసుక రవాణా



ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నా జిల్లా యంత్రాంగం పట్టించుకోవడం లేదు. నగరంలోని అమ్మవెంచర్ సమీపంలో నూతనంగా నిర్మించిన బ్రిడ్జి వద్ద పాంగ్రా వాగులో ఉన్న ఇసుకను అక్రమార్కులు దర్జాగా ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా కట్టడికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



రిజిస్ట్రేషన్లలో ఇష్టారాజ్యం



కార్యాలయ సిబ్బందిపై విరుచుకుపడుతున్న తహసీల్దార్ ప్రవీణ్ కుమార్



ఆఫీస్‌కు ఆలస్యంగా వస్తున్న నాయబ్ తహసీల్దార్

- సమయపాలన పాటించని అధికారులు
- నస్రుల్లాబాద్ తహసీల్‌లో నిర్లక్షధోరణి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. సుదూర ప్రాంతాల నుంచి వివిధ రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వారు గంటల తరబడి కార్యాలయం చెట్టుకింద పడిగాపులు కాయాల్సి వస్తోంది. నస్రుల్లాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది అందరూ పక్కాగా పనిచేయాలని ఆదేశాలిచ్చే తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్..ఆయనే లేటుగా కార్యాలయానికి వస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సోమవారం నస్రుల్లాబాద్ జీపీలో మల్టీపర్పస్ సిబ్బంది ఒకరు చనిపోయారు. అయితే కార్యాలయానికి లేటుగా రావడమే కాకుండా తాను మృతదేహం దగ్గరికి వెళ్లాలని చెప్తూ వచ్చీరావడంతోనే జీపీ సిబ్బందిపై విరుచుకుపడ్డాడు. కార్యాలయంలో ప్రతి అధికారి ఉదయం 10.30 వరకు రావాల్సి ఉండగా సోమవారం నాయబ్ తహసీల్దార్ 10.47కు రాగా, తహసీల్దార్ తాపీగా 11.14కు వచ్చారు. ఈ అధికారుల నిర్లక్ష్యధోరణికి ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపమే కారణమని ప్రజలు వాపోతున్నారు.

జాతీయ కబడ్డీ జట్టు కెప్టెన్‌గా సుశాంక్



సుశాంక్

నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి కబడ్డీ సీనియర్ జట్టు కెప్టెన్‌గా మోర్తాడ్ మండలం పాలెం గ్రామానికి చెందిన కుంట సుశాంక్ ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి లింగయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుశాంక్ ఇటీవల నల్గొండ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి శిక్షణ శిబిరానికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్ యాదవ్ రాష్ట్ర జట్టును వెల్లడించారన్నారు. జాతీయ స్థాయి పోటీలు మహారాష్ట్ర రాష్ట్రం అహ్మద్‌నగర్‌లో ఈ నెల 21నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సుశాంక్‌కు జాతీయ జట్టుకు నాయకత్వం అప్పగించినందుకు జగదీశ్వర్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సుశాంక్‌కు లింగయ్య, సంఘం ప్రతినిధులు, సురేందర్, సాయగౌడ్, సుబ్బారావు, గంగాధర్, రాజ్ కుమార్, జిల్ల కోచ్ మీసాల ప్రశాంత్, సీనియర్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో

బల్కొండ: ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి 3472 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. స్థానిక ఎగువ ప్రాంతాల్లో రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షంతో వరద వచ్చి చేరుతోందని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 7500, లక్ష్మి కాలువ ద్వారా 250, సరస్వతి కాలువ ద్వారా 400, గుత్పలిప్ట ద్వారా 270, అలీసాగర్ లిఫ్ట ద్వారా 347, ముంపు గ్రామాల ఎత్తిపోతల ద్వారా 312, ఆవిరి రూపంలో 472, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో కంటే ఔట్‌ఫ్లో ఎక్కువగా ఉండడంతో ప్రాజెక్ట్ నీటి మట్టం తగ్గుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(90టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1064.60(19.5 టీఎంసీలు) అడుగుల నీటి నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



పొతంగల్(రుద్రూర్): పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని బీజేపీ కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు అరుణతార అన్నారు. పొతంగల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఎంపీ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ, మండల నాయకులు పాల్గొన్నారు.

విజేత జట్లకు ఎస్ఈ అభినందన



నిజామాబాద్‌నాగారం: విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా క్రీడాకారులు అథ్లెటిక్స్, టగ్ ఆఫ్ వార్‌లో ప్రథమస్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విజేతలకు ట్రోఫీలను అందజేశారు. జిల్లాకు చేరిన క్రీడాకారులు ఎస్ఈ రవీందర్‌కు ట్రోఫీలను సోమవారం అందజేశారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను ఎస్ఈ అభినందించారు. స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి గోపి, కోశాధికారి ఉత్తమ్‌సింగ్, ఎస్ఏవో రాజశేఖర్, ఏడీఈ తోట రాజశేఖర్, ఏడీఈ చంద్రశేఖర్, జేఏవోలు సురేశ్, సునీత, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మృతుడి బంధువుల ఆందోళన

- భూమి కాజేసేందుకు కుట్రచేశారన్న ఆరోపణ
- పట్టా పాస్‌పుస్తకం తిరిగి ఇచ్చేయాలని డిమాండ్



న్యాయవాది ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు

ఆర్మూర్‌టౌన్: జంటహత్య కేసులో నిందితుడైన చేపూర్‌కు చెందిన బండి గంగాధర్ ఆదివారం ఆర్మూర్ పట్టణంలో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అయితే, గంగాధర్ భూమిని కాజేసేందుకు కొందరు కుట్రచేయడంతో అతడు ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు సోమవారం పెర్కిట్‌లోని విద్యానగర్‌కు చెందిన ఓ న్యాయవాది ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి... 15రోజుల క్రితం చేపూర్‌లో కులసంఘం సభ్యులతో సమావేశమైన సమయంలో తాను ఓ న్యాయవాదికి రూ.5లక్షలు ఇవ్వాల్సి ఉందని గంగాధర్ తెలిపాడు.

ఇందుకోసం భూమిని విక్రయించేందుకు సదరు లాయర్ సమక్షంలోనే చేపూర్‌కు చెందిన ఓ వ్యక్తి మధ్యవర్తిత్వంతో రూ.5లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. ఈ విషయం కొనుగోలుదారు ప్రతికల్లో ప్రకటన చేశారు. ఇదిలా ఉండగా భూమిని కాజేసేందుకు కుట్ర చేయడంతోనే గంగాధర్ ఆత్మహత్య చేసుకున్నాడని, ఎవరికీ డబ్బులు ఇచ్చేది లేదని వారు ఆందోళన చేశారు. లాయర్ వద్ద ఉన్న పట్టాపాస్‌పుస్తకాలు తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌హెచ్‌వో రవికుమార్ ఘటనాస్థలానికి చేరుకొని మృతుడి బంధువులతో మాట్లాడారు. న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

బాల్య వివాహం అడ్డగింత

ఇందల్వాయి: మండలంలోని గన్నారంలో బాల్యవివాహాన్ని అధికారులు సోమవారం అడ్డుకున్నారు. గన్నారం పాఠశాలలో పదో తరగతి చదివి పరీక్షలు రాస్తున్న ఓ మైనర్ బాలికకు సిరికొండకు చెందిన ఓ వ్యక్తితో ఈ నెల 20న వివాహం చేయాలని ఇరుకుటుంబాలు నిర్ణయించుకున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు సోమవారం బాలిక తల్లిదండ్రులను కలిసి బాల్య వివాహం నిలిపివేసేలా చర్యలు తీసుకున్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అన ర్థాలను తల్లిదండ్రులకు వివరించి కౌన్సిలింగ్ ఇచ్చారు. డిచ్‌పల్లి సీడీపీవో స్వర్ణలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభ, ఐసీపీఎస్ కౌన్సిలర్ జమున, ఎస్సై మనోజ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మోహన్ ఉన్నారు.

నంబర్‌ప్లేట్ లేని బైకులు సీజ్

ఎల్లారెడ్డి: నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న ఐదు బైకులను సీజ్ చేసినట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన వాహనాల తనిఖీలో నంబర్ ప్లేట్లు లేకుండా నడుపుతున్న వాహనాలను గుర్తించి సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వాహనదారులు నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడపవద్దని ఎస్సై సూచించారు. ఎస్సై వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

రాజంపేట: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నర్మాల ప్రవీణ్(32) సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఇంట్లో నీరు పట్టేందుకు మోటర్ స్విచ్ ఆన్‌చేసే క్రమంలో విద్యుదాఘాతం సంభవించి మృతిచెందాడు. మృతుడి భార్య నిఖిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని మహాలక్ష్మి కాలనీకి చెందిన సనిరాజ్ సంఘ్వి అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. సోమవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటికి వెళ్లిన సంఘ్వి తిరిగి రాలేదు. కుటుంబీకులు, బంధువులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కులాస్‌పూర్‌లో..

మోపాల్: మండలంలోని కులాస్‌పూర్‌కు చెందిన నిఖిత అదృశ్యమైనట్లు ఏఎస్సై రమేశ్ సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో హాస్టల్‌లో ఉంటూ బీటెక్ చదువుతున్న నిఖిత శనివారం ఇంటికి వస్తున్నానని చెప్పి రాలేదు. దీంతో కుటుంబీకులు పలుచోట్ల వెతికి ఆచూకీ లభించలేదు. తల్లి సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద కారులో మంటలు



మంటలను ఆర్పుతున్న సిబ్బంది

ఇందల్వాయి: మండల కేంద్రంలోని ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం రాత్రి కామారెడ్డి వైపు వెళుతున్న ఓ కారులో మంటలు చెలరేగినట్లు టోల్ ప్లాజా సిబ్బంది తెలిపారు.

నిర్మల్ నుంచి హైదరాబాద్‌కి కారులో వెళ్తున్న దిలీప్ అనే వ్యక్తి టోల్‌ప్లాజా వద్దకు రాగానే కారులో పొగలు గమనించిన సిబ్బంది అతన్ని అప్రమత్తం చేసి కారుని పక్కకి నిలపగానే మంటలు చెలరేగాయి. సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు మంటలను ఆర్పివేశారు.

మొరం ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

వేల్పూర్: మండలంలోని పడగల్ క్రాస్‌రోడ్డు సమీపంలో ఆదివారం రాత్రి అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ సోమవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడిచేసి పట్టుకున్నట్లు చెప్పారు. వాటిపై చర్య కోసం సంబంధిత అధికారులకు అప్పగిస్తామని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మాచారెడ్డి: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ సోమవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు పాల్వంచ మండలం ఆరేపల్లి ఆయిల్ మిల్ వద్ద ట్రాక్టర్ వద్ద పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పిల్లల చావుకు కారణమైన తల్లికి ఐదేళ్ల జైలు


ఖలీల్‌వాడి: క్షణికావేశంలో భర్తతో గొడవ పడి పిల్లలను కాలువలో తోసేసి తాను ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనలో ఇద్దరు పిల్లలకు చావుకు కారణమైన తల్లికి జిల్లా జడ్జి సునీత కుంచాల ఐదేళ్ల జైలు శిక్ష విధించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నందిపేట్‌కు చెందిన పల్లెపు అమృత ఏర్గట్ల మండలం దోంచంద గ్రామానికి చెందిన పల్లెపు శ్రీనివాస్‌తో వివాహమైంది. వీరికి ఏడాదిన్నర కుమార్తె మణిశ్రీయ, ఆరు నెలల బాలుడు మనుతేజ ఉన్నారు. వీరు కూలీ పని చేసుకుంటూ జీవించేవారు. కుటుంబ పోషణ, ఆర్థిక ఇబ్బందులు, కొనుగోలు చేసిన ట్రాక్టర్ సక్రమంగా నడవకపోడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో అమృత తన తల్లిగారి ఇల్లు అయిన నందిపేట్‌కు వచ్చింది. ఫిబ్రవరి 28న నందిపేట్ మండలంలోని చిరాజ్‌పల్లి శివారులో ఉన్న గుత్ప ఎత్తిపోతల కెనాల్‌లో తన ఇద్దరు పిల్లలను కాలువలో తోసేసి అమృత కాలువలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. అదే సమయంలో పిల్లలు, అమృత కాలువలో కొట్టుకుపోవడాన్ని గమనించిన కానిస్టేబుల్ ఐనారి రాకేశ్ కాలువ వెంబడి పరుగెత్తి అమృతను రక్షించగా పిల్లలు నీటిలో కొట్టుకుపోయారు. దీంతో అమ్మతపై కేసు నమోదైంది. దీంతో న్యాయవిచారణలో పిల్లల మృతికి కారణమైన అమృతకు జడ్జి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, ఆత్మహత్యాయత్నానికి పాల్పడినందుకు ఏడాది పాటు సాధారణ జైలు శిక్ష విధించారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవి రాజ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

ఐఐసీటీ సందర్శన



భిక్కనూరు : తెలంగాణ యునివర్సిటీ సౌత్ క్యాంపస్‌లోని కెమిస్ట్రీ విభాగం విద్యార్థులు హైదరాబాద్‌లోని ఐఐసీటీని సోమవారం సందర్శించారు. ఐఐసీటీలో నిర్వహించిన సంయుక్త 2024 కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అక్కడి శాస్త్రవేత్తలు పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నూతన పరిశోధనల గురించి విద్యార్థులకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్రీ హెచ్‌వోడీ డాక్టర్ నాగరాజుతో పాటు కెమిస్ట్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కుస్తీపోటీలు



నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని గోర్గల్ గ్రామ బేడీల మైసమ్మ ఆలయం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన మల్లయోధుల కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. బేడీల మైసమ్మ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మల్లయోధులకు కుస్తీ పోటీలు నిర్వహించారు. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా మల్లయోధులు రావడంతో పోరు రసవత్తరంగా సాగింది. కార్యక్రమంలో కుస్తీపోటీల నిర్వహకులు దుర్గారెడ్డి, లక్ష్మణ్, దుర్గయ్య, కమ్మరికత్త అంజయ్య, సాయిలు తదితరులు ఉన్నారు.

డీటీసీని కలిసిన ఆర్టీసీ ఆర్‌ఎం



ఖలీల్‌వాడి: నిజామాబాద్ రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ దుర్గాప్రమీలను సోమవారం నిజామాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో డీటీసీకి ఆయన పుష్పగుచ్ఛం అందించారు.